# ఘనంగా సిలికానాంధ్ర ఉగాది వేడుకలు

(ఈనాడు-ఇంటర్‌నెట్ డెస్క్)




లివర్మూర్, మార్చి 25 : సర్వజిత్‌నామ ఉగాది పండగ సందర్భంగా 'సిలికానాంధ్ర' తమ సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తిని మరోసారి ఎలుగెత్తిచాటింది. సిలికాన్‌వేలీలోని శివవిష్ణు దేవాలయం, 'సిలికానాంధ్ర' సంయుక్తంగా మార్చి 24న నిర్వహించిన 'సర్వజిత్‌నామ ఉగాది ఉత్సవం-గజల్ గాంధర్వం' కార్యక్రమం విజయవంతమైంది. ప్రవేశద్వారం వద్ద ఉగాది పచ్చడిని ఆహూతులందరూ ఆత్మీయంగా అందుకుని ఉత్సవాల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 170 మంది పిల్లలు ఉత్సాహంగా పాల్గొని విశేష ప్రతిభకనబరిచారు.




సిలికానాంధ్ర ఈ ఉగాదిని పురస్కరించుకుని ప్రవాస తెలుగు చరిత్రలో కొత్త అధ్యాయానికి తెరతీసింది. తెలుగువారి పిల్లలకు తెలుగులో అక్షరాస్యత.. ప్రతిభ పెంపొందించే సదాశయంతో వారాంతపు పాఠశాల 'మనబడి'ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా 'మనబడి' విద్యార్థులకు వారి తల్లిదండ్రులచే దేవగురువు బృహస్పతుల సమక్షంలో అక్షరాభ్యాసం నిర్వహించింది. కూచిబొట్ల ఆనంద్ బృందం తయారుచేసిన పాఠ్యప్రణాళికను అనుసరించి పిల్లలచే ఓనామాలు దిద్దించింది. ఇంతవరకు సుమారు 150 మంది పిల్లలు విద్యార్థులుగా తమపేర్లను నమోదు చేసుకున్నారని 'మనబడి' నిర్వాహకులు కిషన్‌రావు, తిరుమలశ్రీనివాసరావు, వల్లి, శంకర్ తూములూరు, రాజు తెలిపారు. సిలికానాంధ్ర నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమని.. దీనికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలుగు విశ్వవిద్యాలయం తరపున ఆవుల మంజులత దూరవాణి సందేశంలో తెలిపారు.



సాయంత్రం మారేపల్లి వెంకటశాస్త్రి వేద పఠనంతో ఉగాది ఉత్సవ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శీలాసర్వా నిర్వహణలో పిల్లలు ఆలపించిన స్వాగత గీతాలతో ఆ ప్రాంతమంతా తెలుగు పండగవాతావరణం సంతరించుకుంది. అనంతరం తల్లాప్రగడరావు నేతృత్వంలో కవిసమ్మేలనం నిర్వహించారు. ఇందులో యేడం మస్తాన్‌రెడ్డి, ముంతాజ్‌బేగం, కూచిబొట్ల శాంతి, ప్రఖ్య మధు, తల్లాప్రగడరావు, చిట్టెన్‌రాజు తదితరులు పాల్గొన్నారు. తన కవితలతో ప్రేక్షకులను అలరించిన చిట్టెన్‌రాజుకు 'సిలికానాంధ్ర సాహిత్య భారతి' బిరుదును ప్రదానం చేశారు. అనంతరం సిలికానాంధ్ర అధ్యక్షులు విస్సంరాజుశ్రీఫణి స్వాగతోపన్యాసం చేశారు. ఈ ఉగాది అందరి జీవితాల్లో నిత్యనూతనత్వం నింపాలని ఆయన ఆకాంక్షించారు. వంగూరి ఫౌండేషన్ నిర్వహకులు వంగూరి చిట్టెన్ ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా వ్యవహరించారు.

## శ్రోతలను ఉర్రూతలూగించిన గజల్ గాంధర్వం



ఉగాది సందర్భంగా 'సిలికానాంధ్ర' నిర్వహించిన 'గజల్ గాంధర్వం' ప్రేక్షకులను అలరించింది. ప్రముఖ తెలుగు గజల్ కవులు సినారె, రెంటాల గజళ్లను సిలికానాంధ్ర కార్యదర్శి తల్లాప్రగడరావు, పొట్టియామిని, నారాయణరావు ఆలపించిన తీరు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి కూచిబొట్ల ఆనంద్ వ్యాఖ్యాతగా వ్యవహరించి ప్రతి గజల్ నేపథ్యాన్ని వివరించారు. సంప్రదాయ ఉర్దూ గజళ్లరీతిలో సాగిన గానం ప్రేక్షకులను ఆనందంతో చిందులువేయించింది. ఈ కార్యక్రమ అనంతరం హరిసరోజ, కూచిబొట్ల రవీంధ్ర, చివుకుల రవి తదితరులు స్వయంగా వండి వడ్డించిన తెలుగు ఉగాది వంటకాలను అందరూ ఆరగించారు.